క్లుప్తంగా

తహసీల్దార్ల నియామకం

కొయ్యూరు: మండల తహసీల్దారుగా డి.రాజేశ్వరరావును నియమించారు. ఆయన విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచి బదిలీపై కొయ్యూరు వస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన విధుల్లో చేరనున్నట్టు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన తిరుమలరావును సంతకవిటికి బదిలీ చేశారు.

అడ్డతీగల: అడ్డతీగల తహసీల్దార్‌గా ఏలూరు జిల్లా కొయ్యలగూడెం తహసీల్దార్‌గా నాగమణి నియమితులయ్యారు. ఈమె శుక్రవారం విధుల్లో చేరనున్నట్టు తహసీల్దార్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.తాతారావును పశ్చిమగోదావరి భీమవరం తహసీల్దార్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు ఆయా ఉత్తర్వులను అనుసరించి గురువారం ఆయన ఇక్కడి నుంచి డీటీ తేజస్వినికి బాధ్యతలు అప్పగించి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌లను సిబ్బంది ఘనంగా సన్మానించారు.

రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో బదిలీ అయిన వారి స్థానంలో తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రంపచోడవరం ఆర్డీవో కార్యాలయంలో సత్య సులోచన, రాజవొమ్మంగికి డీవీ సత్యనారాయణ, వై.రామవరానికి నాగరాజు, అడ్డతీగలకు నాగమణి, దేవీపట్నానికి పీవీ చలపతిరావు, మారేడుమిల్లి మండలానికి ఏవీ రామన్‌ను నియమించినట్టు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే వీరు విధుల్లో చేరాల్సి ఉంది.

ఆధార్ నమోదుపై అవగాహన



పెదవలసలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్ తదితరులు

గూడెంకొత్తవీధి: పెదవలస సచివాలయంలో తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని గురువారం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ నమోదు కోసం కేంద్రాన్ని సందర్శించి, సేవలు పొందవచ్చన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. ఆధార్ నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. మండల కన్వీనర్ రమేష్, వార్డు సభ్యులు రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్లు



శ్రీరాంనగర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: పంచాయతీలోని శ్రీరాంనగర్ కాలనీలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది 84 తెల్లజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక వ్యాక్సిన్లు వేశారు. మండలానికి 11వేల డోసుల వ్యాక్సిన్ సరఫరా కాగా ఇప్పటి వరకు 9వేల డోసులు పశువులకు వేసినట్టు పశువైద్యాధికారి తరుణ్ పేర్కొన్నారు. పశువైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసేందుకు రైతు క్షేత్రాలకు వస్తున్నారని, వారికి సహకరించాలని ఆయన రైతులను కోరారు. గురువారం జరిగిన వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమంలో సిబ్బంది కిషోర్, ప్రవీణ్, వెంకన్నబాబు, వెంకటేష్ రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ యూపీ స్కూల్ (తాళ్లపాలెం) విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ ఆరోగ్యశాఖ అధికారులు గురువారం మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. దోమతెరలను ఉపయోగించాలని సూచించారు. హెచ్‌వీ లక్ష్మమ్మ, సీహెచ్‌ఓ రామారావు, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధిలో నవ శకం





కొండలపై ఆవాసాల్లో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి



కొండెక్కి మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్తున్న వలంటీర్లు



గ్రామంలో సోలార్ లైట్లు



కూనవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన్యంలో ఊహించని అభివృద్ధి చోటుచేసుకుంది...ఏళ్ల తరబడి కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని ప్రాంతాల్లో నేడు అభివృద్ధి కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలన్నీ గిరిజనుల చెంతకే అందుతున్నాయి. జగనన్న ప్రభుత్వం గిరిజనాభివృద్ధిలో కొత్త శకానికి శ్రీకారం చుట్టారు.. అడుసులు కట్టిన జుట్టు.. చెవిలో చుట్ట.. చాలీచాలని గోచీ.. మొలకో కత్తి.. చేతిలో బండకత్తి వెరశి ఆదిమ సమాజానికి ఆనవాళ్లుగా హైటెక్ యుగంలోను కొండరెడ్లు దర్శనమిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. తరాలు మారినా మా తలరాతలు ఇంతే అంటూ బాహ్యప్రపంచానికి దూరంగా ఎత్తైన కొండలపైన జనజీవనం గడుపుతున్నారు. అడవి దుంపలు, అటవీ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటూ పోడు వ్యవసాయం జీవనాధారంగా బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతంపై కన్నెత్తి చూడలేదు. ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదు. ఇక కొండలపై శివారు గ్రామాల గురించి పట్టించుకోలేదు. దీంతో సమస్యలతోనే వారు సావాసం చేశారు.. అలాంటి కొండరెడ్ల జీవితాల్లో నేనున్నాను అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా కల్పిస్తున్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సైతం కొండలపై ఆవాసాల్లో ఉంటున్న అట్టడుగు కొండరెడ్లకు అందుతుండడం హర్షణీయం. జగనన్న పాలనలో తమ జీవితాలు మారాయని, ఏళ్ల తరబడిన సమస్యలు పరిష్కారమవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో శివారు గ్రామాలు

కొండరెడ్ల ఆవాసాల్లో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులకు శ్రీకారం చుట్టారు. కళింగమిద్ది, కోపిరిమెట్ట, గబ్బిలాలాగొంది గ్రామాలకు సోలార్ మోటార్ల ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. కొండరెడ్ల ఆవాసాల్లో సోలార్ సిస్టమ్ ద్వారా 54 వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆరోగ్యశ్రీ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల మంజూరు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైదాన ప్రాంతాల్లో జీవిస్తున్న కొండరెడ్లకు అందిస్తున్న అన్ని పథకాలను కొండలపైన దుర్భర జీవనం గడుపుతున్న కొండరెడ్లకు అందిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొండలపై ఉన్న వారికి ఒక్క పథకం కూడా అందిన దాఖలాలు లేవు. రెండు మూడేళ్ల ఏళ్లకోసారి అరకొరగా ఇచ్చే కోళ్లు, మేకలు వంటి స్కీములు మంజూరైనా అవి కొండలపైకి చేరకుండానే దళారుల పాలయ్యేవి. అలాంటి పరిస్థితులకు చెక్కుపెడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలంటరీ, సచివాలయం వ్యవస్థలకు శ్రీకారం చుట్టారు. తద్వారా ప్రతీ పథకం కొండలపై ఉన్న కొండరెడ్లకు ఆయా పథకాలు నేరుగా చేరడంతో అట్టడుగు వర్గానికి చెందిన (పీవీటీజీ) ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూఫ్ కొండరెడ్లలో ఆనందం వెల్లువిరుస్తుంది.

కొండరెడ్ల మొత్తం ఆవాసాలు	69
మొత్తం కుటుంబాలు	1608
జనాభా	6517
కూటూరుగట్ట 9 గ్రామాల్లో	149
ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలో	165
వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు	68
అమ్మఒడి లబ్ధిదారులు	162
ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్న వారు	132
రైతు భరోసా లబ్ధిదారులు	113
వైఎస్సార్ చేయూత	44
ఐటీడీఏ ద్వారా జీఐ షీట్లు పొందినవారు	69
బర్త్ సర్టిఫికెట్లు పొందిన చిన్నారులు	64
ఆయుస్మాన్ భారత్ కార్డుదారులు	414

ఆనందంగా ఉంది



గతంలో పింఛన్ కోసం 15 కిలోమీటర్లు కొండలు దిగి కూటూరు సంతకు వెళ్లితే పింఛన్ అందేది. మోకాళ్ల నొప్పులతో నానా అవస్థలు పడుతూ పింఛన్ అందుకునేదాన్ని. జగన్ వచ్చాక ఆ కష్టం తెలియడంలేదు. గ్రామ వలంటీరు ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికొచ్చి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందజేస్తున్నాడు. దీంతో పాటు పథకాలన్నీ అందుతున్నాయి.ఆనందంగా ఉంది.

– సొందల కొమ్ములమ్మ, కొత్త కారుమానుకొండ

అందరికీ పథకాలు



కొత్త కారుమానుకొండ పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్నాను. ప్రతీనెల ఒకటవ తారీకు వచ్చిందంటే మా కొండల్లో వాళ్లంతా నేను ఎప్పుడు వస్తానా అని చూస్తుంటారు. నేను పింఛన్ సొమ్ములు కొండపైకి తీసుకెళ్లి ఇంటింటికి తిరిగి ఇస్తుంటే వాళ్లు ఎంతో ఆనందపడుతుంటారు. అన్ని పథకాలు గ్రామస్తులకు అందుతున్నాయి. మాగూడెంలో వలంటరీగా పనిచేయడం నాకెంతో గర్వంగా ఉంది.

– కోళ్ల లక్ష్మారెడ్డి, గ్రామ వలంటీర్, కొత్త కారుమానుకొండ

పూరిళ్ల స్థానంలో జీఐ రేకులు పంపిణీ



కూటూరు గట్టు పరిధిలో 69 మంది కొండరెడ్లకు ఇంటిపై కప్పులకు జీఐ రేకులు పంపిణీ చేశాం. జల్‌జీవన్ మిషన్ ద్వారా చింతగండి, పాత కారుమానుకొండ, పులుసుమాడి గొంది గ్రామాల్లో ఇంటింటికీ కుళా యి పనులకు టెండర్లు పిలిచారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటయ్యాయి. అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, కూటూరు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



జీఎం.కొత్తూరులో పసుపు రైతులతో పనులు చేస్తున్న విశ్వేశ్వరరాజు, సర్పంచ్‌లు

జి.మాడుగుల: గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ రాష్ట్ర ప్రజలకు నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గం సమన్వయకర్తచ ఎస్టీ కమీషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో జీ.ఎం.కొత్తూరు గ్రామంలో లబ్ధిదారులకు రూ.3000 పెన్షన్ సొమ్మును ఆయన అందజేశారు. గ్రామంలో పసుపు తవ్వతున్న రైతులకు, సహాయంగా కొంతసేపు వ్యవసాయ పనులు చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ సొమ్మును పెంచి ఎన్నికల వాగ్దానాలను అమలుచేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రకరకాల పార్టీలు వారు లేనిపోని ఆవాకులు, చావకులు మాట్లాడుతున్నారని ఇటువంటి వారిని ప్రజలు నమ్మరన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. రాష్ట్రంలో నవరత్నాలు వంటి ప్రజా సంక్షేమ పథకాలు, అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతీ కుటుంబం లబ్ధి పొందుతూ వస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండం నాయుడు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, మాలన్న, నాయకులు పండన్న, బాబూరావు, శ్రీనివాస్, రమణ, వేణుబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తహసీల్దార్లకు ఆత్మీయ సన్మానం



బదిలీపై వెళుతున్న జీకే వీధి తహసీల్దార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది



చింతపల్లి తహసీల్దార్ పాత్రుడిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తదితరులు



వై.రామవరం తహసీల్దార్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న డీటీ, సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండల తహసీల్దార్ ఎస్.ఎల్.వి.ప్రసాద్ సేవలు మరువలేనివని డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గురువారం జరిగిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ ప్రసాద్‌ను రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు, మండల సర్వేయరు శ్రీను, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: బదిలీపై వెలుతున్న తహసీల్దార్ లత్స పాత్రుడుని గురువారం జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తదితరులు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ తహసీల్దార్‌గా గిరిజనులను మెరుగైన సేవలు అందించిన లత్స పాత్రుడు మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. మండల పార్టీ ప్రచార కార్యదర్శి రాంబాబు, నాయకులు కృష్ణారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లా వెళ్తున్న మండల తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావును డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన అందించిన సేవలను కొనియాడారు. వీఆర్ఓలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన అభినందనలు



అరకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయంకర్త మత్స్యలింగానికి హుకుంపేట నేతల శుభాకాంక్షలు



అరకులోయ వైఎస్సార్‌సీపీ నాయకులతో రేగం మత్స్యలింగం

హుకుంపేట: అరకు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీకి నూతన సమన్వయకర్తగా ఎన్నికైన రేగం మత్స్యలింగంను గురువారం స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతు అభినందించారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణమ, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా, కన్వీనర్లు పాంగి అనిల్, సూరిబాబు, నాయకులు జగదీష్, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: అరకు అసెంబ్లీ సమన్వయకర్తగా రేగం మత్స్యలింగం నియమాకంపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోగల సరబగూడ హౌసింగ్ కాలనీ వద్ద రేగం మత్స్యలింగంను కలిసి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, శత్రుగుణ్, నగేష్, రామ్మూర్తి, నర్సింగ్, తుమ్‌నాథ్, పరశురాం, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐగా సన్యాసినాయుడు బాధ్యతల స్వీకరణ



రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సీఐగా ఎస్.సన్యాసినాయుడు గురువారం బాధ్య తలు స్వీకరించారు. ఆయన పాడేరులో దిశా సీఐగా పనిచేస్తు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ స్వామినాయుడు విశాఖకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐను రాజవొమ్మంగి ఎస్ఐ వెంకయ్య, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు,నాయకులు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ సరియపల్లి గ్రామంలోని కలెక్టర్ నిధులతో సీసీ రోడ్డు, కల్వర్టు పనులకు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ నిధులు రూ.29 లక్షలతో సరియపల్లి నుంచి గ్రామం శివారు వరకు సీసీరోడ్డు, గెడ్డపై కల్వర్టు నిర్మాణం చేపడుతున్నామన్నారు. మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పాంగి సింహాచలం, నాయకుడు బాలరాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



కానివాడలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: పేద ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేస్తారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి స్పష్టం చేశారు. మండల ఎగువప్రాంతం కానివాడ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతీ గ్రామంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 255 గడపలను ఆమె సందర్శించారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. జగనన్న పాలనలో గడప గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీని రానున్న ఎన్నికల్లో భారీ మెజారీతో గెలిపించి, జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సాదాల లక్ష్మి, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మర్రిపాలెం కళాశాల విద్యార్థులు




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బూదరాళ్ల జట్టు

కొయ్యూరు: మూలపేట పంచాయతీ మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఆడుదాం ఆంధ్రాలో వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచారు. దీనిపై ప్రిన్సిపాల్ ఎస్‌కె హరూన్, వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి గురువారం వారిని ప్రసంశించారు. విద్యార్థులు ఎస్.హేమలత, వి.జ్యోతి, బి.సంగీత, జి.బ్రహ్మజీ, పి.కుమారి, కె.లేఖన, బి.అంజని, బి.ప్రమీలలతో కూడిన వాలీబాల్ టీమ్ రాష్ట్రస్థాయి పోటీలో ఆడనున్నట్టు వారు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికకావడం ద్వారా రూ.60 వేలు నగదు గెలుచుకున్నట్టు చెప్పారు. బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కాలేజీ విద్యార్థినులు బి.చోదన, ఎస్.చినపాప ద్వితీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. కా లేజీలో జరిగిన కార్యకమంలో ఆయా విద్యార్థినులతో పాటు కళాశాల పీడీ రమణమ్మను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బూదరాళ్ల టీం : మారుమూల ప్రాంతం బూదరాళ్లకు చెందిన వాలీబాల్ టీం జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆయా టీమ్‌ను కొయ్యూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్. సూరిబాబు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎటపాక: మండలంలోని గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సంస్థ గురువారం అల్పాహారం అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు తాళ్ళూరి హరిబాబు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల వరకు సంస్థ తరపున రోజూ సాయంకాలం అల్పాహారం అందజేస్తామన్నారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవి, పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు కాస్మొటిక్స్ కూడా అందజేశారు.ఈనెల 8న పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, దేశభక్తి గేయాలు, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉలవల శివకనకరాజు చేతుల మీదుగా స్థానిక యువతకు క్రికెట్ కిట్ అందజేశారు. హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయుడు శేఖర్, హోలీ స్పిరిట్ సంస్థ సభ్యులు రవి, టి.రమేష్, ఎం.రమేష్, శ్రీనివాస్, వెంకటేష్, బాబి, తేజ, ప్రశాంత్ పాల్గొన్నారు.